# విశృంఖలం వనితకు సుఖమా



*ఇద మనుచిత మక్రమశ్చ పుంసాం*
*యదిహజరాస్వపి మాన్మథ వికారాః*
*యదపిచనకృతం నితంబినీనాం*
*స్తన పతనావధి జీవితం వారతంవా*

***భావం:*** మగవాళ్ళకి ముసలి వాళ్ళయినా కూడా ప్రేమ జీవితం గడిపే అవకాశముంది. కానీ స్త్రీలకు యౌవన సంబంధమైన సౌందర్య మున్నంత వరకే అవకాశం ఉంచడమే కానీ భగవంతుడు చావైనా ఇవ్వలేదు. ఇంతకన్నా అన్యాయమూ, అక్రమమూ ఇంకొకటి లేదు.

వాణి, రాణి స్నేహితురాళ్లు. రాణి 'మగవాళ్ళు తమ కిష్టమైనంత మంది ఆడవాళ్ళతో తిరుగుతారు. అదే మగవాళ్లు తమ భార్యల దగ్గరకు వచ్చేసరికి మాత్రం నియమాలు పెడతారు. భార్య పతివ్రతగా ఉండాలి. పరాయి వాడికేసి కన్నెత్తి చూసినా పాపమే. ఇదెక్కడి న్యాయం'అంది

వాణి 'నిజమే. మగవాడికో నియమం. స్త్రీకో నియమం ఉండడం అన్యాయం. నా భర్తను తప్పుదారిలో వెళ్లనివ్వకుండా ఏకపత్నీ వ్రతుడిగా దిద్దుకుంటాను' అంది.

'అదెలాగూ కుదరదు. మనమూ వారితో సమంగా సుఖించాలి' అంది. ఇద్దరికీ వివాహాలయ్యాయి. వాణి ప్రేమతో, పాతివ్రత్యంతో భర్త మనస్సును వశం చేసుకుంది. అతడెప్పుడైనా పెడదారి పట్టబోతే సున్నితంగా హెచ్చరించి మనస్సుని మంచి వైపు మళ్ళించేది.

రాణి కూడా తను ముందు చెప్పిన మార్గంలోనే వెళ్లింది. ఏనాడైనా భర్త పరస్త్రీతో కొంత చనువుగా ఉంటే తను ఇంకొక మగవాడితో చనువుగా ఉండేది. అతడు రెచ్చిపోయి పరస్త్రీతో వ్యభిచారానికి దిగితే తనూ అదే పని చేసింది.ఆమె అందగత్తె కాబట్టి చాలామంది మగవారే ఆమెతో తిరిగేవారు. భర్తా తనకునచ్చిన స్త్రీలతో ఉండేవాడు.వాణికన్నా తనే ఎక్కువ సుఖపడుతున్నాని ఆమె ఆనందించేది.

ఏళ్లు గడిచాయి. రాణి జుట్టునెరిసింది. బుగ్గలు లోతుకు పోయాయి. ఎంత జాగ్రత్తగా కాపాడుకున్నా శరీర సౌష్ఠవం తగ్గింది. ఆ తగ్గుదలతోటే ప్రియుల సంఖ్యా తగ్గింది.

రాణి భర్త కూడా ముసలివాడయ్యాడు. బట్టతలా, బాన బొజ్జా, నెరిసిన మీసంతో అందవికారంగా తయారయ్యాడు. కానీ అతని ధనానికీ, అతని పదవి వల్ల లభించే వస్తు వాహనాలకీ ఆశించి స్త్రీలు అతని చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.  రాణికి ఈ పరిస్థితి దుఃఖాన్ని కలిగించింది. ఆ

సమయంలో వాణి తానూ, భర్తా తీర్థయాత్రలకు వెడుతున్నామని చెప్పడానికి వచ్చింది.

రాణి ఉక్రోషంతో 'భగవంతుడు మగవాడే. అందుకే మగవారికి వృద్ధాప్యంలో కూడా ప్రేమ జీవితమిచ్చాడు. స్త్రీలకు యౌవన సౌందర్యంతోటే సుఖించే యోగాన్ని తీసేశాడు. అలాగని చావు కూడా ఇవ్వలేదు' అంది.

వాణి 'భగవంతుడు మగా కాదు ఆడా కాదు. ఆ సచ్చిదానంద స్వరూపం అన్నిటికీ అతీతమైనది. నీ ఆలోచనలో లోపముంది. కేవలం శరీరం గురించి ఆలోచించావు. నీకు ధర్మం కానీ, మనస్సు కానీ పట్టలేదు' అంది.

రాణి కథా, వాణి హెచ్చరికా స్త్రీలందరూ గమనించాలి. స్త్రీ జనోద్ధరణకే రాస్తున్నానన్న చలం నుంచి నేటి సినీ తారల దాకా అందరూ స్త్రీకి స్వేచ్ఛ కావాలంటున్నారు. స్వేచ్ఛ అనే పేరుతో ఉన్న ఈ విశృంఖలం స్త్రీలకి లాభదాయకమా? మగువలు కోరుకోవలసింది మగవారిలో నియమబద్ధతా లేక తాము కూడా రేఖ దాటడమా? రేఖ దాటితే చివరకు మిగిలేదేమిటి?

******